# తెల్లకాకి

-దూరి వెంకటరావు

''మా నాన్న దగ్గర నుంచేనా ఆ ఉత్తరం'' భర్తచేతిలో కవరు చూసి అడిగింది అపర్ణ.

''ఔను. సాక్షాత్తూ మీ కన్నతండ్రి దగ్గర నుంచే. మీ చెల్లెలకి పెళ్ళంట. శుభలేఖ కూడా పంపాడు'' అన్నాడు ఆనందరావు.

అతడి మాటలలో కించిత్ వెటకారం ధ్వనిస్తోంది.

''ఏమన్నారు?..ఉమకి పెళ్ళా?..అయితే ఆ సాలూరు సంబంధం ఖాయమైపోయిందన్నమాట. అబ్బ, ఎంత చల్లని కబురు చెప్పారండి'' అంటూ గబగబా వంటింట్లోకెళ్ళి గుప్పెడు పంచదార పట్టుకొచ్చి మగడి నోట్లో గుమ్మరించింది అపర్ణ.

''చాల్లే సంబడం. చెల్లెకి పెళ్ళనగానే ఎక్కడలేని మాటలు వస్తాయి. అదే నా కివ్వవలసిన స్కూటరు గురించి అడగమంటే మాత్రం నోరు విడదు'' నిష్ఠూరమాడాడు ఆనందరావు.

''మా నాన్న అన్నాడంటే ఎప్పుడో ఒకప్పుడు ఇచ్చి తీరుతాడు. దానికోసం మీరేం కంగారు పడనక్కర్లేదు. మన పెళ్లికి చేసిన అప్పు ఇంకా తీరలేదంట. కాస్త కాలు చెయ్యి కూడ దీసుకోనివ్వండి''

''తండ్రికి తగ్గ కూతురనిపించుకున్నావ్. నువ్వన్నట్లు నిజంగా మీ నాన్నకి డబ్బు ఇబ్బందేవుంటే ఉమకి పెళ్ళెలా చేస్తున్నాడు'' రీజను తీసాడు ఆనందరావు.

ఆ మాటకి నోట్లో పచ్చి వెలగకాయ పడ్డట్టైంది అపర్ణకి. అంతే, మరి మాట్లాడలేదు. ఉన్నంతలో ఉమ పెళ్లి ఆర్భాటంగానే జరిపిస్తున్నాడు జగన్నాథం. అల్లుడు, కూతురు తప్ప మిగిలిన బంధుజనమంతా వారం రోజులు ముందే వచ్చి తిష్టవేసారు. ఎవరికీ ఏ లోటు రాకుండా జాగ్రత్తపడుతోంది జానకమ్మ.

''స్కూటరు విషయంలో మాట నిలబెట్టుకోనందుకు అల్లుడు అలిగి అటకెక్కాడేమోననిపిస్తోంది'' అన్నాడు జగన్నాథం.

''ఔనండి నాకూ అలాగే అనిపిస్తోంది. చిన్నమ్మాయి పెళ్లికి పెద్దకూతురు అల్లుడు రాలేదంటే మనకెంత అవమానం? వెళ్ళి బ్రతిమలాడైనా తీసుకురండి'' అన్నది జానకమ్మ.

అలాగే అంటూ చెప్పుల్లో కాళ్ళు దూర్చబోయాడు జగన్నాథం.

మాటల్లో దిగారు ఆనందరావు దంపతులు. జానకమ్మ కళ్ళల్లో వేయి జ్యోతులు వెలిగాయి.

''నీకు నూరేళ్ళయ్యా...ఇప్పుడే నీ గురించి అనుకుంటున్నాం'' అల్లుణ్ణి ఆప్యాయంగా పలకరించి లోపలకు తీసుకెళ్ళాకు జగన్నాథం.

రాత్రి పదవుతోంది. ముహూర్తం దగ్గరపడే కొద్దీ మంటపంలో జనం పెరుగుతున్నారు. మేళాలమోత, మంత్రాల ఘోష పతాకస్థాయికి చేరుకుంది.

ఉన్నట్లుండి లైట్లు ఆరిపోయాయి. పెళ్లి పందిట్లో చిమ్మచీకటి అలుముకుంది. ఒకరి ముఖాలొకరికి కనబడటం లేదు.

''పెళ్ళే పెళ్లి ముందు జాగ్రత్తగా గ్యాస్‌లైటు పెట్టుకోవాలన్న ఇంగిత జ్ఞానం ఉండనక్కర్లా'' సందు దొరికింది కదా అని సన్నిహితులు జగన్నాథాన్ని చీవాట్లేస్తున్నారు.


అంతలో ''నా నక్లెస్'' అంటూ కెవ్వున కేక పెట్టింది అపర్ణమెడ తడుముకుంటూ.

ఎవరో అగ్గిపుల్ల వెలిగించారు.

భార్య బోసిమెడ చూసి షాక్ తిన్నాడు ఆనందరావు.

తలొకరు తలో రకంగా మాట్లాడసాగారు.

కాస్సేప



టికి లైట్లు జిగ్గుమన్నాయి. అందరికీ ప్రాణం లేచొచ్చినట్లైంది.

పెళ్లికి వచ్చినవాళ్ళంతా ఆప్తులు, బంధువులు. ఎవర్ని అనుమానించాలో బోధపడటం లేదు జగన్నాథానికి. అడక్కుండానే కొందరు తమకేం తెలియదన్నట్లు అమాయకంగా తమ హ్యాండ్ బ్యాగులు తెరిచి చూపించారు.

పెళ్ళయిపోయింది. తాంబూలాలు తీసుకుని ఆహుతులొక్కక్కరూ నిష్క్రమిస్తున్నారు. దిగులుగా కూర్చున్న అపర్ణని ఓదారుస్తున్నాడు ఆనందరావు.

''పెళ్లికని పుట్టింటికొచ్చిన ఆడపిల్ల కంటతడి పెడుతూ వెళితే ఎవరికీ శుభం కాదండి. నామాట విని వీటిమీద మరికొంత సొమ్మేసి కొత్తనగ పట్టుకురండి'' అంటూ చేతులకున్న గాజుల్ని తీసిచ్చింది జానకమ్మ.

ఆఘమేఘాల మీద నగల దుకాణానికెళ్ళి కొత్త నక్లెస్సు కొనుక్కొచ్చాడు జగన్నాథం.



పోయిన నగ స్థానంలో కొత్త వస్తువు వచ్చి చేరడంతో తృప్తిగా ఊపిరి పీల్చింది అపర్ణ.

మరుసటి రోజే తిరుగు ప్రయాణమయ్యారు ఆనందరావు దంపతులు.

కాలం కర్పూరంలా కరిగిపోతుంది.

ఉమకు ప్రసవ సమయమని, ఇంట్లో ఎవరు దక్షత లేరంటూ కబురు చేసాడు జగన్నాథం.

తనకు సెలవు దొరక్కపోవడంతో అపర్ణను వెళ్ళి రమ్మన్నాడు ఆనందరావు.

సరేన ప్రయాణానికి కావలసిన చీరల్ని బీరువాలోంచి తీస్తుండగా నక్లెస్సు జారి క్రిందపడింది.

దానిని చూసి అమితాశ్చర్యపోయింది అపర్ణ. పెళ్లిలో పోయిన నగ ఇందులోకెలా వచ్చిందా అని ఆలోచిస్తూ ఉండగా, ''ఏమిటోయ్ అలా తెల్లబోతున్నావ్? అది నీ నగే'' అన్నాడు ఆనందరావు దగ్గరకొస్తూ.

''అది..అది'' అంటూ ఏదో అనబోతోంది అపర్ణ. అయితే నోట్లోంచి మాట ఊడి బయట పడటం లేదు.

''ఇందులో ఆశ్చర్యపోవలసిందేం లేదు. దాన్ని ఆరోజు నేనే నీ మెడలోంచి లాగేసాను'' అన్నాడు ఆనందరావు.

''మీ వస్తువుని మీరే దొంగిలించవలసినంత ఖర్మమే మొచ్చిందండి?'' అమాయకంగా అడిగింది అపర్ణ.

''ఇస్తానన్న స్కూటరెంతకీ ఇవ్వకపోవడంతో వళ్ళుమండి అలా చేసాను. నగ పోయిందంటే మీ నాన్న చచ్చినట్లు మరొకటి కొనిస్తాడు'' అన్నాడు ఆనందరావు తను చేసిన నిర్వాకానికి తనే గర్వపడుతూ.

''అదేం పనండి. ఆరోజు ఆ వస్తువు మీ జేబులోనే ఉందని తెలిస్తే నలుగురిలో మీ పరువు ఏమయ్యేది?'' అంది అపర్ణ భర్త చేసిన పనికి ఛీదరించుకుంటూ.

''దొంగని గుర్తించటానికి అనుమానం వస్తే ఎవరి జేబుసైనా చూపించమంటారు తప్ప సొమ్ము పోగొట్టుకున్నవాడి జేబు జోలికి మాత్రం పోరు'' అంటూ మానవ మనస్తత్వశాస్త్రాన్ని విపులీకరించాడు ఆనందరావు.

మరి కిమ్మనలేదు అపర్ణ.

ఆ సాయంత్రమే భార్యని బస్సెక్కించాడు ఆనందరావు.

అపర్ణ రాకతో ఆ ఇంట అందరి మనసులలో ఆనందం వెల్లి విరిసింది.

''ఇప్పటికే బాగా ఆలస్యమైపోయింది. అల్లుడిగారిని ఏమీ అనుకోవద్దని చెప్పు. ఇదుగో స్కూటరు సొమ్ము నిన్ననే నాకు పేఫిక్సేషన్ ఎరియర్సు అందాయి'' అంటూ ముప్పై వేలు కూతురి చేతిలో పెట్టబోయాడు జగన్నాథం.

''వద్దు నాన్నా. ఆయన స్కూటరు గురించి మరి డబ్బు అడగొద్దన్నారు'' అంది అపర్ణ.

''అదేం అలా'' అంటూ నోరు వెళ్ళబెట్టాడు జగన్నాథం.

''నెక్లెస్ పోతే కొత్తది కొనిచ్చావు కదా అందుకని''

''వస్తువుపోతే మరొకటి కొనిచ్చాను. నిజమే. అంత మాత్రాన స్కూటరుకి డబ్బిచ్చినట్లు ఎలా అవుతుంది?'' అమాయకంగా అడిగాడు జగన్నాథం.

''మీకెవరికీ తెలీదు కాని ఆయన మనసు నవనీతం నాన్నా. ఆరోజు కొత్త నగ తెచ్చివ్వడానికి అమ్మ తన గాజులివ్వడం ఆయన కళ్ళారా చూసారు. అందుకే మరి స్కూటరు గురించి వత్తిడి చేయవద్దన్నారు.''

''అలాగా, ఏమో అనుకున్నాను. మా అల్లుడు ఎంత మంచివాడు? అనవసరంగా అతడిని అపార్థం చేసుకున్నాను'' నొచ్చుకుంటున్నట్లుగా అన్నాడు జగన్నాథం.

''హుం. తెల్లని కాకులు, అల్లుడి మంచితనం ఇలలో ఎక్కడా ఉండదన్న సామెత ఉండనే వుంది. నాన్న పిచ్చివాడు. అందుకే నా మాట నమ్మేసాడు. ఇంకా నయం ఆయన ఉండగా డబ్బిచ్చాడు కాదు. తేరగా వచ్చిందికదా అని తన్నుకుపోయి వుండేవాడు'' అనుకుంది మనసులో అపర్ణ.

★